క్లుప్తంగా

జోడుగుళ్లపాలెంలో వెన్నెల కిషోర్ సందడి



లొకేషన్‌లో నటుడు వెన్నెల కిషోర్

కొమ్మాది : బీచ్ రోడ్డు జోడుగుళ్లపాలెంలో గురువారం షూటింగ్ సందడి నెలకొంది. నటులు వెన్నెల కిషోర్, ప్రియదర్శిపై పలు సన్నివేశాలను ఇక్కడ చిత్రీకరించారు. గత వారం రోజుల నుంచి విశాఖ – భీమిలి బీచ్ రోడ్డు ప్రాంతాల్లో శివలెంక కృష్ణ ప్రసాద్ నిర్మాణంలో శ్రీదేవి మూవీస్ పతాకంపై దర్శకుడు ఇంద్రగంటి మోహన్‌కృష్ణ తెరకెక్కిస్తున్న ఓ సినిమాకు సంబంధించిన సన్నివేశాలు చిత్రీకరించారు. హీరోయిన్‌గా రూప కొడువాయూర్ నటిస్తున్న సంగతి తెలిసిందే. గురువారంతో ఈ సినిమా షూటింగ్ పూర్తయినట్లు చిత్ర యూనిట్ తెలిపింది.

విద్యార్థినులకు వైద్య పరీక్షలు



విద్యార్థినులను పరీక్షిస్తున్న వైద్యురాలు

భీమునిపట్నం : స్థానిక ఏపీ బాలికల గురుకుల పాఠశాల వద్ద మండల లీగల్ సర్వీసెస్ కమిటీ, 15వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి పి.సౌజన్య ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఫణికుమార్ పర్యవేక్షణలో వైద్యులు విద్యార్థినులకు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందించారు. న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు ఎంవీ.పార్వతీశం, కార్యదర్శి కేఎస్ఎం సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

క్విట్ ఇండియా స్ఫూర్తితో పోరాడాలి



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఛాత్రోపాధ్యాయులు

భీమునిపట్నం : స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ వారిపై భారతీయుల పోరాటంలో భాగమైన క్విట్ ఇండియా స్ఫూర్తి ప్రతి ఒక్కరిలోనూ ఉండాలని జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్) ప్రిన్సిపాల్ ఎం.జ్యోతికుమారి సూచించారు. గురువారం నిర్వహించిన క్విట్ ఇండియా సంస్మరణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో మాదక ద్రవ్యాలు, అవినీతి, అపరిశుభ్రతతోపాటు చాలా సమస్యలు ఉన్నాయని... ఈ మహమ్మారులపై క్విట్ ఇండియా స్ఫూర్తితో పోరాటం చేయాలని సూచించారు. అందరూ కలిసికట్టుగా ఉద్యమించాలని కోరారు. అధ్యాపకులు సోమయాజులు, మహాలక్ష్మి, మాధవి, హరిణి, రవి పాల్గొన్నారు.

రోడ్డు మీదే డెబ్రిస్



రోడ్డు మీద వేసిన డెబ్రిస్

కొమ్మాది : జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ అంగన్‌వాడీ భవనం ఎదురుగా రోడ్డు మీద డెబ్రిస్‌ను బుధవారం అర్ధరాత్రి డంపింగ్ చేశారు. దీంతో స్థానికులకు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఇక్కడ నివసిస్తున్న ఓ వ్యక్తి తమ పాత బిల్డింగ్‌ను తొలగించి దానికి సంబంధించిన డెబ్రిస్‌ను రోడ్డు మీదే విడిచిపెట్టాడు. దీంతో అటుగా వెళ్తున్న వారికి పెద్ద సమస్యగా మారింది. రోడ్డు మీదకు ధూళితోపాటు డెబ్రిస్ రావడంతో ప్రయాణించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రశాంతంగా పాఠశాల కమిటీల ఎన్నికలు



బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో నూతన కమిటీతో ఉపాధ్యాయులు



ఏపీ బాలికల గురుకుల పాఠశాల చైర్మన్ చిన్నారావు, వైస్ చైర్‌పర్సన్ సురవరపు సుగుణ



మజ్జివలస హైస్కూల్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులతో పాఠశాల కమిటీ ప్రతినిధులు

తగరపువలస : భీమిలి అర్బన్, రూరల్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం పాఠశాల నిర్వహణ కమిటీల ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. వాస్తవానికి ఈ ఎన్నికల పట్ల తల్లిదండ్రులెవరూ పెద్దగా ఆశక్తి చూపలేదు. భీమిలి మండలం లక్ష్మీపురం పంచాయతీ కరగానిపేట, విజయరాంపురం పాఠశాలల్లో వైఎస్సార్‌సీపీ బలపరచిన కమిటీలు ఏకగ్రీవమయ్యాయి. వీరిని వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, సర్పంచ్ లచ్చుబుగత జగదీశ్వరరావు అభినందించారు. మజ్జివలస జెడ్పీ హైస్కూల్ చైర్మన్‌గా బట్టు అప్పన్న, వైస్ చైర్మన్‌గా గిన్ని లక్ష్మి ఎన్నికయ్యారు. వీరిని సర్పంచ్ తుపాకుల ఆదిలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు దాట్ల పెదబాబు, తుపాకుల అప్పలరాజు, తుపాకుల సురేష్ అభినందించారు. మజ్జిపేట జెడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాల ఎన్నికలో వైఎస్సార్‌సీపీ బలపరచిన అభ్యర్థులే గెలిచారు. వీరిని సర్పంచ్ మజ్జి సూరినాయుడు, ఎంపీటీసీ సభ్యుడు మజ్జి శ్రీనివాసరావు అభినందించారు. చిట్టివలస హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడు పొట్నూరు మురళీమోహనరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికలో కె.భాగ్యలక్ష్మి చైర్మన్‌గా, పచ్చిపాల చిట్టిబాబు వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. జీవీఎంసీ బంగ్లామెట్ట ఒకటో వార్డు పాఠశాలలో చైర్మన్‌గా షేక్ షర్మిల, వైస్ చైర్మన్‌గా పందిరి ప్రవీణ్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలను ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు, ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, బుగత మల్లిక, పిన్నింటి నాగమణి నిర్వహించారు.

భీమునిపట్నం: భీమిలిలోని ఆంధ్రప్రదేశ్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జి.జయప్రకాశ్ పర్యవేక్షణలో నిర్వహించిన ఎన్నికలో కమిటీ చైర్మన్‌గా దేవరాపల్లికి చెందిన గొరె చిన్నారావు, వైస్ చైర్‌పర్సన్‌గా ఎండాడకు చెందిన సురవరపు సుగుణ ఎన్నికయ్యారు. కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ప్రిన్సిపాల్ గంగాకుమారి పర్యవేక్షణలో చైర్మన్‌గా సీహెచ్.కుమార్, వైస్ చైర్‌పర్సన్‌గా ఐ.రమణమ్మ ఎన్నికయ్యారు. మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.సింహాచలం పర్యవేక్షణలో చైర్మన్‌గా కారి లక్ష్మి, వైస్ చైర్మన్‌గా కాసరపు రత్నకుమారి ఎన్నికయ్యారు. నెహ్రూ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు తిరుమల శ్రీదేవి ఆధ్వర్యంలో చైర్‌పర్సన్‌గా పి.మంగమ్మ, వైస్ చైర్మన్‌గా నిడిగట్టు కృష్ణ ఎన్నికయ్యారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ప్రధానోపాధ్యాయుడు రమణ ఆధ్వర్యంలో చైర్‌పర్సన్‌గా ఎర్ని శారదదేవి, వైస్ చైర్‌పర్సన్‌గా పి.లీల ఎన్నికయ్యారు.

కొమ్మాది : జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు శైలజ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికలో యాజమాన్య కమిటీ చైర్‌పర్సన్‌గా ఎం.దేవి, వైస్ చైర్మన్‌గా ఎ.కృష్ణ ఎన్నికయ్యారు. జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేట జిల్లా పరిషత్ హైస్కూల్ యాజమాన్య కమిటీ చైర్‌పర్సన్‌గా అల్లిపిల్లి అమ్మాజీ, వైస్ చైర్‌పర్సన్‌గా బేరా కృష్ణవేణి ఎన్నికయ్యారు. జీవీ అగ్రహారం ఎంపీయూపీ పాఠశాల కమిటీ చైర్మన్‌గా సీహెచ్ అప్పలనర్సి, వైస్ చైర్మన్‌గా సీహెచ్ ఎల్లారి, నిడిగట్టు ఎంపీపీ పాఠశాల కమిటీ చైర్మన్‌గా బోడి అప్పారావు, వైస్ చైర్‌పర్సన్‌గా బోర అప్పయమ్మ, చేపలుప్పాడ, కె.దిబ్బడపాలెం, కాపులుప్పాడ ఎంపీయూపీ పాఠశాలల కమిటీ చైర్మన్లుగా కె.నూకరాజు, వాసుపల్లి నూకరత్నం, ఎంరెడ్డి పోలయ్య ఎన్నికయ్యారు.

నిలిచిపోయిన రెండు పాఠశాలల ఎన్నికలు

పద్మనాభం : మండలంలో రెండు పాఠశాలల ఎన్నికలు నిలిచిపోయాయి. వివాదాలు తలెత్తడంతో కొత్త కొవ్వాడ ప్రాథమికోన్నత, అనంతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఎస్ఎంసీ ఎన్నికలు నిలిచిపోయాయి. మిగతా 59 పాఠశాలలకు ఎన్నికలు జరిగాయి. ఐనాడ ప్రాథమిక పాఠశాలలో ఎస్ఎంసీ ఎన్నికలో మధ్యాహ్నం ఒంటి గంట వరకు హైడ్రామా నడిచింది. టీడీపీకి చెందిన వారు ఇక్కడ ఎన్నికలు నిలిపివేయాలని పట్టుబట్టారు. చివరకు కోరం సరిపోవడంతో ఎన్నిక నిర్వహించగా వైఎస్సార్ సీపీ మద్దతుదారు గొడ్డు రమణమ్మ చైర్‌పర్సన్‌గా, కె.పైడిరాజు వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు.

మారికవలస గెడ్డ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..



గెడ్డ స్థలంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

మధురవాడ : విశాఖ రూరల్ మండలం పరదేశిపాలెం రెవెన్యూ గ్రామం మారికవలస వద్ద జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ప్రభుత్వ గెడ్డ స్థలంలో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఇక్కడ గెడ్డ స్థలంలో 400 గజాలను మారికవలసకి చెందిన టీడీపీ నాయకుడు యంత్రాలతో చదును చేయించేసి ఆక్రమించేసిన విషయం తెలిసిందే. ఈ బరితెగింపుపై గెడ్డలనూ ఆక్రమించేస్తాం శీర్షికతో సాక్షిలో గురువారం ప్రచురించిన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. ఈ మేరకు సచివాలయ గ్రేడ్ – 2 వీఆర్వో యువరాజ్, సిబ్బంది హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అయితే బోరవానిపాలెం – మారికవలస మధ్య ఉన్న ప్రైవేటు లే అవుట్‌ని ఆనుకుని ఉన్న గెడ్డ స్థలం వైపు మాత్రం కన్నెత్తి కూడా చూడలేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

పాఠశాల స్థలం కబ్జా

- జీవీఎంసీ 2వ వార్డు కార్పొరేటర్ అండతో టీడీపీ నాయకుడి నిర్వాకం



సంగివలసలో జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల భవనం ముందు కర్రలు, పెంకులు, బడ్డీ

తగరపువలస : జీవీఎంసీ రెండో వార్డు సంగివలస ఈడబ్ల్యూఎస్ కాలనీలోని ప్రాథమిక పాఠశాల స్థలాన్ని స్థానిక టీడీపీ నాయకుడు చిట్టిబాబు కబ్జా చేసేశాడు. పాఠశాల ముందు తన వ్యాపారానికి సంబంధించిన బడ్డీ, కర్రలు, పెంకులు ఉంచాడు. నాలుగు రోజుల క్రితం ఈ బడ్డీ కింద పిల్లి చనిపోవడంతో దుర్వాసన భరించలేక విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. దుర్వాసన కారణంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సైతం సహించడం లేదు. దీంతో పాఠశాల యాజమాన్యం, చుట్టుపక్కల వారు వచ్చి బడ్డీ, కర్రలు, పెంకులు తొలగించాలని చెప్పినా తనకు వార్డు కార్పొరేటర్ ఆశీస్సులు ఉన్నాయని, తనను ఎవరూ ఏమీ చేయలేరని చిట్టిబాబు చెప్పి వెళ్లిపోయాడు. దీంతో పారిశుధ్య సిబ్బంది వచ్చి పిల్లి చనిపోయిన చోట తాత్కాలికంగా బ్లీచింగ్ చల్లి వెళ్లిపోయారు. పాఠశాల ఎదురుగా ప్రైవేట్ స్థలంలో తుప్పలు ఎక్కువగా ఉన్నందున తరచూ విష పురుగులు వచ్చి బడ్డీ కింద, కర్రల మధ్య వుంటున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. వీటి వల్ల విద్యార్థులకు ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పాఠశాల వంటగదిని జరిపించి కొంత స్థలం కబ్జా చేసిన చిట్టిబాబు ఇప్పుడు మొక్కలు వేయనీయకుండా తన వ్యాపారానికి పనికి వచ్చే సామగ్రి పాఠశాల ముందు ఉంచి మొండిగా వ్యవహరిస్తున్నాడని... అటువంటి వ్యక్తికి కార్పొరేటర్ వత్తాసు పలకడం విడ్డూరంగా ఉందని కాలనీవాసులు వాపోతున్నారు. దీనిపై జీవీఎంసీ అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

తగరపువలస : చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ, మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆపరేషన్ జోన్ – 3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ అంతరాయం కారణంగా కొండపేట, పంప్‌హౌస్ లైన్, జ్యూట్‌మిల్లు క్వార్టర్స్, సంతపేట, గణేష్ థియేటర్ రోడ్డు, ఫుట్‌బాల్ గ్రౌండ్ ఏరియా, సప్తగిరి లే అవుట్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

◆ భీమిలి బీచ్‌రోడ్డు, రూరల్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది. సోమన్నపాలెం, రెడ్డీలపాలెం, నగరపాలెం, మంగమారిపేట, వైఎస్సార్ జగనన్న కాలనీ, వుడా అపార్ట్‌మెంట్లు, బ్యాంకు కాలనీ, తాతాజీనగర్, ఎల్లమ్మపేట, మహాలక్ష్మిపురం, డెక్కతిపాలెం, రాజలింగంపేట, రేఖవానిపాలెం, రాయపాలెం, మరడపాలెం, మూలకుద్దు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది.

పరిశుభ్రంగా పోలీస్ స్టేషన్



పరిశుభ్రంగా పోలీస్ స్టేషన్ పరిసరాలు

భీమునిపట్నం : భీమిలి పోలీస్ స్టేషన్ పరిసరాలు గురువారం పరిశుభ్రంగా మార్చారు. ఇక్కడకు వచ్చే ఫిర్యాదుదారులు వేచి వుండేందుకు వీలుగా పరిసరాలను సీఐ డి.రమేష్ చక్కగా తీర్చిదిద్దించారు. అందులో భాగంగా ఇక్కడి ఆవరణలోని పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలను మరో ప్రాంతానికి తరలించారు. అనంతరం పరిసరాలను శుభ్రపరడంతోపాటు మొక్కలు నాటారు. ఫిర్యాదుదారులు కూర్చోవడానికి కుర్చీలు, సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. దీంతో పోలీస్ స్టేషన్ పరిసరాలు ఎంతో అందంగా మారిపోయి అందరినీ ఆకట్టుకుంటున్నాయి.

భవిత కేంద్రాల్లో అర్హులనే చేర్చాలి



మధురవాడ భవిత కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ఐఈ కో ఆర్డినేటర్ గీత

మధురవాడ : భవిత కేంద్రాల్లో దివ్యాంగులను చేర్పించి సేవలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా భవిత కేంద్రం ఐఈ కో ఆర్డినేటర్ బి.గీత సూచించారు. మధురవాడలోని భవిత కేంద్రాన్ని ఆమె గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇక్కడ దాతలు సాయంతో నాటిన మొక్కలు, పిల్లలకు అందుతున్న సదుపాయాలు, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అలాగే రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ గదిలో కేంద్రం నిర్వహణ, ఫిజియోథెరపీ, ఇతర సేవలకు భవనం సరిపోనందున అదనంగా మరో గది నిర్మాణం విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో భవిత సెంటర్ టీచర్స్ ఎస్.మహాలక్ష్మి, ఎస్‌కే సలీమ, తదితరులు పాల్గొన్నారు.

అధికలోడుతో వెళ్లే వాహనాలపై రవాణా శాఖ కొరడా



భీమిలి క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

తగరపువలస : అధికలోడు, సరకులతో వెళ్తున్న వాహనదారులపై రవాణా శాఖ కొరడా ఝుళిపించింది. ఈ మేరకు గురువారం పలుచోట్ల రవాణా శాఖ అధికారులు వాహనాలు తనిఖీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన రెండు వాహనాలపై కేసులు నమోదు చేశారు. భీమిలి క్రాస్ రోడ్డు వద్ద మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు రాజారావు, శిరీష మాట్లాడుతూ నిబంధనలు అతిక్రమించి అధిక లోడుతో వాహనాలు నడపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బిల్డింగ్ పైనుంచి జారిపడి యువకుడి మృతి



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న క్లూస్ టీమ్ సభ్యులు

కొమ్మాది : పని చేస్తుండగా బిల్డింగ్ పైనుంచి ఓ యువకుడు జారి పడిపోయి మృతి చెందిన సంఘటన జీవీఎంసీ 8వ వార్డులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... సాగర్‌నగర్‌లోని ఓ ప్రాంతంలో కొత్తగా బిల్డింగ్ నిర్మిస్తున్నారు. ఈ బిల్డింగ్ ఫినిషింగ్ వర్క్ నిమిత్తం (గ్లాస్ వర్క్) యజమాని కన్యాకుమారి నుంచి ముగ్గురు యువకులను ఐదు రోజుల క్రితం రప్పించారు. ఈ క్రమంలో అజిత్ రాజ్ (26) పని చేస్తుండగా మంగళవారం రాత్రి బిల్డింగ్ పైనుంచి పడిపోయాడు. గమనించిన తోటి పని వారు అజిత్ రాజును వెంటనే ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఇది జరిగి రెండు రోజులు గడుస్తున్నా ఆరిలోవ పోలసులు గోప్యంగా ఉంచడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విషయం బయటకు రాకుండా జాగ్రత్త పడినప్పటికీ గురువారం ఈ విషయం అందరికీ తెలిసింది. దీంతో క్లూస్ టీమ్ సభ్యులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. యువకుడు బిల్డింగ్ పైనుంచి పడిపోయాడా..? లేక ఇతర కారణాలేమైనా ఉన్నాయా..? అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

పీఎం పాలెం : సహజీవనం చేస్తున్న మహిళతో జరిగిన గొడవ కారణంగా దువ్వాడ రామారావు (30) బుధవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్వతంత్రనగర్‌కు చెందిన ఇతను భార్యతో విడిపోయి కొంత కాలంగా సింధుశ్రీ అనే మహిళతో సహజీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన ఇతను తరచూ ఆమెతో గొడవ పడేవాడు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి వీరిద్దరి మధ్య గొడవ జరిగింది. తర్వాత అతను గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. గురువారం ఉదయం సింధుశ్రీ కిటికీ లోనుంచి చూడగా రామారావు ఫ్యానుకు వేలాడుతూ కనిపించాడు. ఆమె ద్వారా విషయం తెలుసుకున్న రామారావు సోదరుడు దువ్వాడ మోహన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భారీ గోతులు తీసి... ఇసుక తవ్వకాలు



ప్రమాదకరంగా గొయ్యి తీసి ఇసుక తవ్విన చోట చేరిన నీరు



పాత సామియ్యవలసలో తవ్వితీసిన ఇసుక

తగరపువలస : పద్మనాభం మండలం పాండ్రంగి పంచాయతీ పాత సామియ్యవలసలో మళ్లీ యథావిధిగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని, వాటిని అరికట్టాలని స్థానిక యువకులు కోరుతున్నారు. ప్రమాదకరంగా గోతులు తీసి... అక్కడి నుంచి థర్మాకోల్ షీట్లతో చేసిన తెప్పల సాయంతో ప్రాణాలు ఫణంగా పెట్టి ఇసుకను తోడుతున్నారు. కొన్నిచోట్ల పెట్టిన గోతులు నీటితో నిండిపోతున్నాయి. అనుకోని పరిస్థితుల్లో మట్టిపెళ్లలు కూలినా, తెలియని వ్యక్తులు దిగినా ప్రాణాపాయమని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తవ్వకాలు అడ్డుకోవాల్సిన రెవెన్యూ, పోలీస్ విభాగాల అధికారులు చూస్తూ ఊరుకోవడంతో వ్యాన్‌ల ద్వారా ఇసుక సరిహద్దులు దాటుతోందని యువకులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం గోస్తనీనదికి వర్షం నీరు ఎక్కువగా వస్తున్నందున ఇలాంటి సమయంలో ఇసుక తవ్వకాలు ప్రమాదమని, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

యాజమాన్య పద్ధతులతో పంటకు అధిక ధర



విలాస్కాన్‌పాలెంలో పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అప్పలస్వామి



తాటితూరులో రైతులకు నారుమడి వద్ద శిక్షణ ఇస్తున్న ఏవో శివకోమలి

తగరపువలస : రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి చేసిన వ్యవసాయం ద్వారా పంటను అధిక ధరకు విక్రయించుకోవచ్చని భీమిలి ఏవో బి.శివకోమలి సూచించారు. భీమిలి మండలం తాటితూరులో గురువారం నిర్వహించిన పొలంబడిలో రైతులకు శిక్షణ ఇచ్చారు. 2024 – 25 ఖరీఫ్ సీజన్‌లో భాగంగా రైతులకు 14 వారాల్లో వారానికి ఒకరోజు శిక్షణ ఇవ్వనున్నట్టు ఆమె తెలిపారు. 50 శాతం రాయితీతో విత్తన శుద్ధి మందు పంపిణీ చేయడంతోపాటు, ఎంపిక చేసిన పొలాల్లో మట్టిని విశాఖలోని ప్రయోగశాలకు పంపించామన్నారు. దమ్ములు, ఉడుపులలో భాగంగా నారుమడిలో నారుకట్టుట, ఒకేలా చివర్లు తుంచుట చేసి చూపించారు. మడిలో లేదా డ్రమ్ములో 3 నుంచి 4 బకెట్ల నీటిలో పావు లీటర్ క్లోరోపైరిఫాస్ కలిపి చివర్లు తుంచిన నారుకట్టలు మునిగేలా 10 నుంచి 15 నిమిషాలు ముంచిన తర్వాత ఉడుపులు వేసేలా చూడాలని సూచించారు. దీనివల్ల ఆకుముడత, కాండం తొలిచే పురుగు ఉధృతిని నివారించవచ్చన్నారు. కాలిబాటలు తీయడం వల్ల ఉపయోగాలు తెలియజేశారు. కార్యక్రమంలో రైతులు ఒరుపుల శ్రీను, పల్లంటి వెంకటరమణ, గోవింద్, నక్కా శివ, చిన్న పాల్గొన్నారు.

తగరపువలస : ఆనందపురం మండలం బోని పంచాయతీలో వ్యవసాయాధికారులు గురువారం రైతులకు పొలంబడిలో భాగంగా అవగాహన కల్పించారు. జిల్లా వ్యవసాయాధికారి కొత్తూరు అప్పలస్వామి, భీమిలి ఏడీ విజయప్రసాద్, ఏవో చావా సంధ్యా రత్నప్రభ రైతులతో కలిసి వరి పొలాలను పరిశీలించారు. వరి పంటకు మార్కెట్ సదుపాయాలను వివరించారు. రెండో విడతలో భాగంగా ఎకరాకు 20 కిలోల యూరియా వేయాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ దిలీప్, రైతులు పాల్గొన్నారు.

ఈ – పంట నమోదు చేయాలి

పద్మనాభం : రైతులు ఖరీఫ్‌లో సాగు చేస్తున్న వరి పంట వివరాలను ఈ – పంటలో నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.అప్పలస్వామి సూచించారు. మండలంలోని పెంట, కొవ్వాడ, విలాస్కాన్‌పాలెం, మద్ది గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించి ఈ – పంట నమోదును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ – పంట నమోదుతో ప్రభుత్వం ఏర్పాటు చేసే కేంద్రాలకు ధాన్యం అమ్ముకోవచ్చన్నారు. ఏవో ఎంవీఎస్ చలం, ఏఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో మొక్కల తొలగింపు



ప్రభుత్వ భూమిలో రైతులు నాటిన మొక్కలను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

తగరపువలస : ఆనందపురం మండలం బాకూరుపాలెం సర్వే నంబరు 3 బోడిమెట్ట కొండపై ప్రభుత్వ స్థలాన్ని కొందరు వ్యక్తులు ఐదు రోజులుగా చదును చేసి మొక్కలు నాటేశారు. తమకు చెందిన జిరాయితీ స్థలాలను ఆనుకుని ప్రభుత్వ స్థలంలో జరుగుతున్న కబ్జాపై స్థానికుల ఫిర్యాదు మేరకు తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్ గురువారం వెళ్లి పరిశీలించారు. ప్రభుత్వ స్థలంలో నాటిన నీలగిరి, మామిడి మొక్కలు పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే మీ భూములకు సంబంధించిన డిజిటల్ సిగ్నేచర్‌ను డిస్ప్యూట్‌లో పెడతామని హెచ్చరించారు. అనంతరం వీఆర్వోలు, తలయారీల సాయంతో ప్రభుత్వ భూములలోని మొక్కలు తొలగించారు.

చట్టాలపై అవగాహన అవసరం



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి వెంకట శేషమ్మ

తగరపువలస : భీమిలి మండలం తాటితూరులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు గురువారం నిర్వహించారు. సంస్థ కార్యదర్శి, జిల్లా సివిల్ జడ్జి ఎం.వెంకటశేషమ్మ మాట్లాడుతూ చట్టాలకు అందరికీ అవగాహన వుండాలని సూచించారు. ఉచిత న్యాయ సహాయం, హెల్మెట్ వినియోగం, మైనర్ డ్రైవింగ్, డ్రగ్స్ నివారణపై వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.రామారావు, ఎంపీడీవో జానకి, భీమిలి సీఐ డి.రమేష్, ఎస్ఐ గంటా హరీష్ పాల్గొన్నారు.

సెంట్రింగ్ కార్మికుడు దుర్మరణం

పీఎం పాలెం: సెంట్రింగ్ పనులు చేస్తున్న కార్మికుడు నిర్మాణంలో ఉన్న భవనం 5వ అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు పడిపోయి దుర్మరణం చెందాడు. పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... తగరపువలస బలిజనగర్‌లో నివసిస్తున్న బాడితమణి రమణ (38) భవన నిర్మాణ సెంట్రింగ్ కార్మికుడు. జీవీఎంసీ ఆరో వార్డులోని గాయత్రి ఇంజినీరింగ్ కాలేజీ హాస్టల్ 5వ అంతస్తు నిర్మాణ పనులకు రమణ బుధవారం హాజరయ్యాడు. పనులు చేస్తుండగా సాయంత్రం ప్రమాదవశాత్తు కిందకు పడిపోయాడు. వెంటనే ఆస్పత్రికి తరలించేందుకు 108 అంబులెన్స్‌ను రప్పించగా... అప్పటికే రమణ మరణించినట్టు వైద్య సిబ్బంది నిర్ధారించారు. మృతుని భార్య రమాదేవికి కాలేజీ ప్రతినిధి వై.కనకరాజు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఆమె భర్త మృతదేహాన్ని చూసి కన్నీరు మున్నీరుగా విలపించింది.

మందుబాబులకు రూ.70వేల జరిమానా

తగరపువలస : ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ఏడుగురికి భీమిలి 15వ అదనపు మెట్రో పాలిటన్ మేజిస్ట్రేట్ డి.సౌజన్య రూ.10 వేల వంతున రూ.70 వేల జరిమానా గురువారం విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు వాహనదారులు తమతో సహకరించాలని కోరారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ నిండు జీవితాలను ఫణంగా పెట్టొద్దని సూచించారు.

గీతంలో టీసీఎస్ నిపుణులు

కొమ్మాది : టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ గ్లోబల్ అధిపతి ఇ.సుధాకర్, మానవ వనరుల విభాగం అధిపతి శ్రీరామ్ జోషి గురువారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించి విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్, ఎంబీఏ తదితర కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రపంచ వ్యాప్తంగా ఐటీ, వాణిజ్య రంగాల్లో వస్తున్న మార్పులపై అవగాహన కల్పించారు.